క్లుప్తంగా

ఎర్రచందనం దుంగలు స్వాధీనం
– ఇద్దరు స్మగ్లర్ల అరెస్ట్


ఎర్రచందనం దుంగలు, స్మగ్లర్లతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

తిరుపతి మంగళం : అక్రమంగా తరలిస్తున్న ఎనిమిది ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, ఇద్దరు స్మగ్లర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. టాస్క్‌ఫోర్స్ ఎస్పీ పీ.శ్రీనివాస్ ఆదేశాల మేరకు డీఎస్పీ జీ.బాలిరెడ్డి పర్యవేక్షణలో కడప సబ్‌కంట్రోల్‌లోని ఆర్ఐ ఎం.చిరంజీవులకు చెందిన ఆర్ఎస్ఐ పీ.నరేష్ టీమ్, ఎఫ్‌బీఓ జీ.కిరణ్ కుమార్‌తో కలసి అన్నమయ్య జిల్లా, రాజంపేట పరిధిలోని ఎస్ఆర్‌పాళెం సెక్షన్‌లో కూంబింగ్ చేపట్టారు. రోళ్లమడుగు బీట్ వద్ద ఎరచ్రందనం దుంగలను మోసుకుని వస్తున్న స్మగ్లర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు చుట్టుముట్టారు. వారిలో కొందరు పారిపోగా ఇద్దరు స్మగ్లర్లను పట్టుకున్నట్టు టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ బాలిరెడ్డి తెలిపారు. వారు తమిళనాడుకు చెందిన వారుగా గుర్తించినట్టు వెల్లడించారు. వారి నుంచి ఎనిమిది ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు. స్మగ్లర్లను తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్‌కు తరలించగా, సీఐ సురేష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

గంజాయి స్వాధీనం


నిందితుడితో పోలీసులు

నారాయణవనం: రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని రాజ్‌కుమార్(28) అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు పుత్తూరు రూరల్ సీఐ రవీంద్ర తెలిపారు. గురువారం ఎస్ఐ రాజశేఖర్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. గురువారం పాలమంగళం వద్ద అరుణానది సమీపంలో సిబ్బందితో కలిసి గాలింపు చేపట్టామన్నారు. నది ఒడ్డున తచ్చాడుతున్న రాజశేఖర్‌ను అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నిందితుడు మండలంలోని మిట్టనైనారుకండ్రిగకు చెందిన జడబిళ్ల రాజకుమార్‌గా గుర్తించామన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఈ భూమి నాది.. కాదు నాది!

రేణిగుంట విమానాశ్రయం, జాతీయ రహదారి ఆనుకుని రూ.కోట్ల విలువచేసే ప్రభుత్వ భూమిని కొట్టేసేందుకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు ఈ భూమికి సంబంధించి కోర్టులో తమకు అనుకూలమైన తీర్పు వచ్చిందని ఓ వర్గం గురువారం భూమిని చదును చేయగా, మరోవర్గం ఆ భూమి తమదంటూ పనులను అడ్డుకుంది. దీంతో తహసీల్దార్ రంగప్రవేశం చేసి పనులను అడ్డుకుని తాత్కాలికంగా ఆపేశారు. అయితే వెబ్ ల్యాండ్‌లో ఈ భూమి ప్రభుత్వ భూమిగా స్పష్టంగా ఉన్నా అధికారులు కాపాడేందుకు మీనమేషాలు లెక్కిస్తుండడం గమనార్హం.


ఎయిర్‌పోర్ట్ సమీపంలో ప్రభుత్వ భూమిని చదును చేస్తున్న యంత్రాలు

- రూ.కోట్ల విలువజేసే ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం
- రేణిగుంట విమానాశ్రయ సమీపంలో రెండు వర్గాల ఘర్షణ
- అడ్డుకున్న తహసీల్దార్
- టీడీపీ ముఖ్యనేత అనుమతితోనే కుట్ర!

రేణిగుంట: రేణిగుంట మండలం, కొత్తపాలెం రెవెన్యూ లెక్క దాఖల సర్వే నం.103–6సీలో 1.33 ఎకరాలు, 104–ఏలో 2.74 ఎకరాలు మొత్తం 4.07 ఎకరాల ప్రభుత్వ భూమి తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయానికి, పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారికి ఆనుకుని ఉంది. ఇక్కడ ఎకరా భూమి రూ.7 కోట్ల నుంచి రూ.10 కోట్లకు పైగా ధర పలుకుతోంది. అయితే ఈ భూమికి సంబంధించి తమకు పట్టా ఉందని ఓ వర్గం ఆ స్థలంలో బోర్డు పెట్టారు. కోర్టులో తీర్పు తమకు అనుకూలంగా వచ్చిందని గురువారం రెండు జేసీబీలు, ట్రాక్టర్లు పెట్టి చదును చేశారు. అయితే ఆ భూమి తమదంటూ, చెన్నైకి చెందిన మరో వర్గం ప్రతినిధులు అక్కడికి చేరుకుని పనులను అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. వీఆర్‌వో ఇచ్చిన సమాచారం మేరకు రేణిగుంట తహసీల్దార్ సురేష్‌బాబు ఘటనా స్థలానికి చేరుకున్నారు. భూమికి సంబంధించి ఇరు వర్గాల దగ్గర ఉన్న పత్రాలను తీసుకొని తహసీల్దార్ కార్యాలయానికి రావాల్సిందిగా ఆదేశిస్తూ తాత్కాలికంగా పనులను ఆపారు.

టీడీపీ ముఖ్యనేత అండదండలతోనే...

నియోజకవర్గంలోని టీడీపీ ముఖ్యనేత అండదండలతోనే రూ.30 కోట్ల నుంచి రూ.40 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని చేజిక్కించుకునేందుకు కుట్ర చేస్తున్నట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. ఎకరానికి రూ.50 లక్షల చొప్పున తీసుకుని వారికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ఓ వర్గం తమ వద్దనున్న డాక్యుమెంట్లతో ఆ భూమి తమదంటూ కోర్టులో కేసులు వేసి వ్యాజ్యాలు కూడా నడుస్తున్నట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో కూడా వీరు పలుమార్లు ఈ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నించగా, అప్పట్లో రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు.

పనులు ఆపినట్టే ఆపి..

ఈ భూమిలో జరుగుతున్న పనులను తహసీల్దార్ సురేష్‌బాబు వచ్చి అడ్డుకుని తాత్కాలికంగా నిలిపివేశారు. తన అనుమతి లేనిదే మళ్లీ ఎవ్వరూ భూమిలోకి ప్రవేశించొద్దని హెచ్చరించారు. అయితే ఏమైందో ఏమోకానీ కాసేపటికే మళ్లీ ఓ వర్గం పనులను చేపట్టడం విశేషం.


ఆక్రమణదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్

“

విచారించి చర్యలు తీసుకుంటాం

రేణిగుంట విమానాశ్రయ మార్గం సర్వే నం .103,104 లో ఉన్న 4.07 ఎకరాలు భూమి ప్రభుత్వ భూమిగా ఉంది. ఈ భూమిలో ఇరువర్గాలు మాదంటే మాదని గొడవపడ్డారు. వారు చేపడుతున్న పనులను అడ్డుకున్నాం. ఈ భూమికి సంబంధించి తమ వద్ద రికార్డులున్నట్లు ఇరు వర్గాలు వారి వద్దనున్న డాక్యుమెంట్లు అందించారు. వాటిని పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

– సురేష్‌బాబు, తహసీల్దార్, రేణిగుంట

తుమ్మలగుంట చెరువు సేఫ్!

- వాటర్ కంట్రోల్ గేట్, మిగిలిన నీరు కిందికి పోయే నిర్మాణం అలాగే ఉంది
- లోలెవల్ ఏరియా కూడా ఎక్కడా దెబ్బతినలేదు
- ఈ–టెండర్ల ద్వారానే అభివృద్ధి పనులు
- అసెంబ్లీలో ప్రకటించిన మంత్రి నారాయణ

తిరుపతి రూరల్: తుమ్మలగుంట చెరువుకు సంబంధించిన నిర్మాణాలు అన్నీ యథాతథంగానే ఉన్నాయని, ఎలాంటి ఇబ్బందీ లేదని అసెంబ్లీ సాక్షిగా పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ ప్రకటించారు. చెరువుకు సంబంధించిన వాటర్ కంట్రోల్ గేట్, మిగిలిన నీటిని కిందకు వెళ్లేందుకు ఉన్న నిర్మాణానికి కూడా ఎలాంటి నష్టం చేయలేదని చెప్పారు. చెరువులో కింది భాగానికి కూడా ఎలాంటి ఇబ్బందీ కలిగించలేదన్నారు. తుమ్మలగుంట చెరువులో జరిగిన అభివృద్ధి, సుందరీకరణ పనుల వల్ల చెరువు ధ్వంసమైందని ఎమ్మెల్యే పులివర్తి నాని గురువారం అసెంబ్లీలో ప్రశ్నలు వేశారు. గత ప్రభుత్వంలో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నపుడు తుమ్మలగుంట చెరువులో హాకీ గ్రౌండ్, టెన్నిస్ కోర్టు, యోగా కేంద్రం, ధ్యాన మందిరం, క్రికెట్ మైదానం, హాకీ, ఫుట్‌బాల్, టెన్నిస్ కోర్టు, షటిల్ కోర్టు, ఆర్చరీ, అథెలిటిక్స్ గ్రౌండ్, వాలీబాల్, బాస్కెట్ బాల్, కబడ్డీ కోర్టు, బాక్సింగ్ రింగ్, వాకింగ్ ట్రాక్, ఫ్యామిలీ పార్క్, గో కార్టింగ్, స్కేటింగ్, శాండ్ వాక్, బీచ్ వాలీబాల్ వంటివి ఏర్పాటు చేయడం వల్ల చెరువుకు నష్టం వాటిల్లిందని చెప్పారు. దీనికి మంత్రి నారాయణ సమాధానం ఇచ్చారు. చెరువుకు ఎలాంటి నష్టం కలిగించలేదని చెప్పారు. పార్కు అభివృద్ధి పారదర్శకంగా ఈ–టెండర్ ద్వారా మొత్తం 90 పనులు చేశారని, మరో 12 పనులతో పచ్చదనం పెంపొందించేందుకు చేపట్టారని మంత్రి ప్రకటించారు. చెరువు ఆయకట్టు కేవలం 88.81 ఎకరాలు మాత్రమే ఉందని స్పష్టం చేశారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

నాయుడుపేట టౌన్: రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతిచెందగా.. ముగ్గురు గాయపడిన ఘటన మండల పరిధిలోని పండ్లూరు గ్రామ సమీపంలో గురువారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. పోలీసుల కథనం.. చైన్నై వైపు నుంచి నెల్లూరుకు వెళుతున్న లారీ గురువారం తెల్లవారు జామున 1.30 ప్రాంతంలో టైర్ పంక్చర్ అయ్యింది. దీంతో పంచర్ వేసేందుకు డ్రైవర్ లారీ టైర్ తీస్తున్నాడు. వెనుక నుంచి వేగంగా వచ్చిన మరో లారీ రోడ్డుపై నిలిపి ఉన్న లారీని ఢీకొట్టింది. టైర్ విప్పుతున్న డ్రైవర్ పఠాన్ ముత్తుజా ఖాన్(58) లారీ టైర్ కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. హైవేపై విధులు నిర్వహిస్తున్న సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, హైవే మొబైల్ పోలీసులు స్థానిక ఏఎస్ఐ ధర్మయ్యతో కలిసి ఘటనా స్థలం వద్దకు చేరుకున్నారు. తీవ్రంగా గాయపడిన మార్కాపురం పాంతానికి చెందినలారీ క్లీనర్ జగన్, ఢీకొన్న లారీలో ఉన్న గూడూరుకు చెందిన డ్రైవర్ అహమ్మద్ రఫీ, కావాలి ప్రాంతానికి చెందిన క్లీనర్లు వెంకటేశర్లును వైద్య చికిత్సల నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. లారీ డ్రైవర్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం మార్చురీకి తరలించారు. రహదారిపై నిలిచి పోయిన లారీలను క్రేన్ల సహాయంతో పక్కకు జరిపి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని తన కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.


మృతి చెందిన డ్రైవర్‌ను వెలుపలకు తీసిన హైవే పోలీసులు (ఇన్‌సెట్) మృతి చెందిన లారీ డ్రైవర్ ముత్తుజాఖాన్

రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులకు సూచనలు ఇస్తున్న స్కూల్ ఫెడరేషన్ సంస్థ కార్యదర్శి బాబు

రామచంద్రాపురం: మండలంలోని నెత్తకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం తిరుపతి, చిత్తూరు జిల్లా అండర్–14 జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ క్రీడా పోటీలను ఎంఈఓ జయవేలు, తిరుపతి జిల్లా స్కూల్ ఫెడరేషన్ సంస్థ కార్యదర్శి బాబు, హెచ్ఎం తులసి కుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా స్కూల్ ఫెడరేషన్ సంస్థ కార్యదర్శి బాబు మాట్లాడతూ జిల్లా స్థాయి అండర్–14 త్రోబాల్ పోటీలలో 12 మంది బాలురు, 12 బాలికలు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు వెల్లడించారు. వీరిలో అండర్–14 బాలికల విభాగంలో భానుశ్రీ (సోమల, కందూరు), సుకన్య (నగరి), పద్మశ్రీ(సదుమూరు, కుప్పం), వర్షణ (పీసీఆర్, చిత్తూరు), వాణి (పంగూరు, ఏర్పేడు), చాందిని(పంగూరు, ఏర్పేడు), అనన్య (సోమల), దిశాలినీ (నెత్తకుప్పం), అక్షర(సోమల), వసంతిక (కందూరు), రాణి(పెద్ద కనపర్తి),గౌరీప్రియ (పూతలపట్టు), బాలుర విభాగంలో వసంత్‌కుమార్ (ఏకాంబరకుప్పం), గురులోకేష్ (పెద్ద కనపర్తి), మహమ్మద్ సయ్యద్ (బీనేపల్లి, ఉర్దూ స్కూల్), చరణ్‌తేజ్ (సోమల), రోహిత్ (మొగరాల), రేవంత్ (కందూరు), భువనేష్ (సదమూరు), తులసీరాం (పంగూరు), జహీర్ (రొంపిచెర్ల), కుశ్వంత్ (నెత్తకుప్పం), ప్రణీత్ (పీసీఆర్, చిత్తూరు), నితీష్ (పూతలపట్టు) ఉన్నట్లు తెలిపారు. వీరు త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో పీడీలు సుబ్రమణ్యం రెడ్డి, గోపీనాథ్, చిన్నప్ప, కరుణానిధి, లోకేష్, భవానీ, భార్గవి, దేవరాజులు, సురేష్ పాల్గొన్నారు.

తాళ్లమ్మ ఆలయం కేసు వేగవంతం

- నిందితుల గుర్తించే పనిలో పోలీసులు

దక్కిలి: మండలంలోని దగ్గవోలు గ్రామ దేవత తాళ్లమ్మ ఆలయంలో రెండు రోజుల క్రితం జరిగిన చోరీ కేసును ఛేదించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. వెంకటగిరి సీఐ వెంకటరమణ ఆధ్వర్యంలో పలు బృందాలు పనిచేస్తున్నాయి. మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆలయంలోకి ప్రవేశించి హుండీ పగులగొట్టి నగదును ఎత్తుకెళ్లారు. అంతేగాక అమ్మవారి ఆభరణాలు కూడా దొంగిలించారు. ఈ వ్యవహారాన్ని గ్రామస్తులు గుర్తించి దక్కిలి పోలీసులకు బుధవారం రాత్రి ఫిర్యాదు చేశారు. వెంకటగిరి సీఐ వెంకటరమణ, బాలాయపల్లి ఎస్ఐ కామినేని గోపీ, వెంకటగిరి–2, ఎస్ఐ నాయక్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. తిరుపతి నుంచి క్లూస్ టీమ్‌ను రప్పించి వేలిముద్రలను సేకరించారు. దొంగలు ఎక్కడి నుంచి వచ్చారు.. దేవస్థానం తాళాలు పగులగొట్టి వచ్చారా.. ఎంత మంది చోరీకి పాల్పడ్డారు అన్న కోణాలపై పోలీసులు దర్యాప్తు సాగిస్తున్నారు. దేవస్థానం ఆవరణలో ఏర్పాటు చేసిన సీసీ టీవీ పుటేజీని సేకరించి పరిశీలించారు. ఇందులో చోరీకి పాల్పడ్డ వారు ఇద్దరు ఉన్నట్టు గుర్తించారు. అమ్మవారి నగలు, హుండీ కానుకలు, నగదు భారీ ఎత్తున చోరీ జరగడం చూస్తే బయట వ్యక్తుల పాత్ర ఉంటుందని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.


ఆలయంలో గర్భగుడి తలుపును కట్ చేసిన దొంగలు


ఆలయంలో దొంగలు ధ్వంసం చేసిన హుండీ, బీరువా, మైక్‌సెట్

ముందుగానే రెక్కీ నిర్వహించి..

తాళ్లమ్మ ఆలయంలో చోరీకి పాల్పడ్డ ఘనటకు ముందు గత ఆదివారం ఇద్దరు వ్యక్తులు ఆలయంలోకి వచ్చి రెక్కీ నిర్వహించారు. ఆ తర్వాత అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ పూజారి వారిని చూసి స్థానికులు, సమీప గ్రామాల భక్తులు కాదని గుర్తించి ప్రశ్నించడంతో తమది కడప జిల్లా, రాజంపేట అని వారు సమాధానం ఇచ్చినట్టు తెలుస్తోంది. ఆ మరసటి రోజే ఈ ఘటన జరగడం పలు అనుమానాలకు తావిస్తోంది.

దక్కిలి మండలంలో వరుస ఘటనలు

దక్కిలి మండలంలో గత ఆరు నెలలుగా వరసుగా దేవాలయాల్లో చోరీలు చోటు చేసుకుంటున్నాయి. ఈ ఏడాది మేలో మండలంలోని కుప్పాయిపాళెం గ్రామదేవత నాంచారామ్మ తల్లి ఆలయంలో చోరీ జరిగింది. ఆలయంలో అమ్మవారికి సంబంధించి 9 కిలోల విలువ జేసే త్రిశూలం, హుండీలో ఉన్న రూ.20 వేల కానుకలు అపహరించుకెళ్లారు.గత సెప్టెంబర్‌లో దక్కిలిలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వస్వామి ఆలయంలో హుండీని పగులగొట్టి అందులో ఉన్న రూ.15 వేల నగదును చోరీ చేశారు. తాజాగా తాళ్లమ్మ తల్లి ఆలయంలో చోరీ సంఘటనతో భక్తులు ఆందోళన చెందుతున్నారు.

చోరీకి గురైన ఆభరణలు ఇవే

చోరీకి గురైన ఆభరణాలు వెండి కిరీటం–1 (1000 గ్రాములు), వెండి కళ్లు –2 (200గ్రా), డైమండ్ ముక్కు పుడక –1, బంగారు కాసులు –10 (20 గ్రా), బంగారు గుండ్లు 15 (15 గ్రా), బంగారు తాళిబొట్లు –1 (12 గ్రా), పంచలోహాల తాళిబొట్టు 1 (10 గ్రా), వెండితో తయారు చేసిన వడ్డాణం (1000 గ్రా)లతోపాటు హుండీలోని నగదు దొంగలించినట్టు పోలీసులకు ఫిర్యాదు అందింది.

అనుమానాస్పద స్థితిలో విద్యార్థి మృతి!

- ఈత కొడుతూ చనిపోయాడంటున్న స్నేహితులు
- లేదు కొట్టి చంపేశారంటున్న బంధువులు


మృతి చెందిన హేమాద్రి

రేణిగుంట: ఎస్వీ ఆర్ట్ కళాశాల విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. ఈత కొడుతూ ప్రమాద వశాత్తు మునిగిపోయాడని మృతుని స్నేహితులు చెబుతుండగా.. కాదు కొట్టి చంపేశారని అతని బంధువులు ఆరోపిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. తిరుమలకు చెందిన గంగరాజు కుమారుడు హేమాద్రి (20) తిరుపతి ఎస్వీ ఆర్ట్స్ కాలేజ్‌లో డిగ్రీ చదువుతున్నాడు. తోటి స్నేహితులు తొమ్మిది మందితో కలసి గురువారం మామండూరు అటవీ ప్రాంతంలోని వాగులో ఈతాడుతుండగా, హేమాద్రి లోతు ఉన్న ప్రాంతానికి వెళ్లడంతో మునిగిపోయాడు. అతని స్నేహితులు డయల్ 100కు కాల్ చేయడంతో పోలీసులు చేరుకుని హేమాద్రిని గట్టుపైకి తీసుకొచ్చి చికిత్స నిమిత్తం కరకంబాడి సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిశీలించిన డాక్టర్లు అప్పటికే విద్యార్థి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆపై మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు రేణిగుంట అర్బన్ ఎస్ఐ అరుణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

బిడ్డ శరీరంపై గాయాలున్నాయ్!

తిరుపతి సిటీ: చనిపోయిన విద్యార్థి హేమాద్రి వివరాలను సేకరించిన పోలీసులు ఎస్వీ ఆర్ట్స్ కళాశాల అధికారులకు, తల్లిదండ్రులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి మామండూరు యాత్రకు వెళ్లిన విద్యార్థులను అదుపులోనికి తీసుకుని విచారిస్తున్నారు. ప్రమాదమా... హత్యా అనే కోణంలో విచారిస్తున్నట్లు సమాచారం.

ప్రమాదం కాదు హత్యే

మా అబ్బాయిని స్నేహితులే చంపేశారు. మాది పులివెందుల. మా అబ్బాయి ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. స్నేహితులతో కలసి విహారయాత్రకు వెళ్లారు. ఈత రాక మునిగిపోయినట్లు స్నేహితులు చెబుతున్న మాటలలో వాస్తవం లేదు. మా అబ్బాయికి ఈత వచ్చు. మృతదేహంపై గాయాలు ఉన్నాయి. స్నేహితుల మధ్య గొడవలు తలెత్తి మా అబ్బాయిని కొట్టి చంపారనే అనుమానాలు ఉన్నాయి. –మునిరాజ, మృతుని బంధువు

నా బిడ్డను ఉన్నతాధికారిగా చూడాలనుకున్నా

అయ్యో... కొడుకా హేమాద్రి.. పెద్ద చదువులు చదివి ప్రభుత్వ అధికారిగా వస్తావని కలలు కన్నానే.. నేను బతికుండగానే నిన్ను ఇలా చూడడం తట్టుకోలేకపోతున్నాను. తల్లిలేని బిడ్డని ఎంతో ప్రేమగా చూసుకున్నాను. నిన్ను చదివించేందుకు రెక్కల కష్టం చేస్తున్నా. అయ్యా ఏమి జరిగింది దేవుడా... అంటూ మృతుని తండ్రి రుయా ఆస్పత్రి వద్ద గుండెలు పగిలేలా రోదించడం చూపరులను కంటతడి పెట్టించింది.

ఎర్రచందనం పరిరక్షణకు కృషి చేయాలి

తిరుపతి మంగళం : ఎర్రచందనం పరిరక్షణకు అటవీశాఖ, టాస్క్‌ఫోర్స్ సంయుక్తంగా కృషి చేయాలని రాష్ట్ర అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(పీసీసీఎఫ్) ఎస్ఎస్.శ్రీధర్ సూచించారు. తిరుపతి కపిలతీర్థం సమీపంలోని టాస్క్‌ఫోర్స్ కార్యాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. శేషాచలంలోని అరుదైన ఎర్రచందనం అక్రమంగా తరలిపోకుండా పటిష్ట చర్యలు చేపట్టాల్సిన బాధ్యత అటవీశాఖ, టాస్క్‌ఫోర్స్ పోలీసులపై ఉందన్నారు. స్మగ్లర్లు అడవుల్లోకి చొరబడి చెట్లు నరకకమందే వారిని నిలువరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

రిజర్వాయర్ పనులు వేగవంతం

తిరుపతి అర్బన్: రిజర్వాయర్ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సిబ్బందిని ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం ఇరిగేషన్ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. తిరుపతి, తిరుమల ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని బాలాజీ, మల్లెమడుగు రిజర్వాయర్ పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ప్రాజెక్టు పనులకు సంబంధించి ఓ నివేదిక ఇవ్వాలని కోరారు. ఇరిగేషన్ అధికారులు మదనగోపాల్, రాధాకృష్ణమూర్తి, వెంకటేశ్వర్ ప్రసాద్ పాల్గొన్నారు.

మూడు నెలలు పింఛన్ తీసుకోకుంటే కట్


శోభనబాబు, డీఆర్‌డీఏ పీడీ

తిరుపతి అర్బన్: సామాజిక భద్రత పింఛన్‌దారులు వరుసగా మూడు నెలలు పింఛన్ సొమ్ము తీసుకోకుంటే అలాంటి వాటిని నిలుపుదల చేస్తారని డీఆర్‌డీఏ పీడీ శోభన బాబు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మొదటి నెల పింఛన్ తీసుకోకుంటే రెండో నెలలో ఇస్తారన్నారు. వరుసగా రెండు నెలలు పింఛన్ తీసుకోకుంటే మూడో నెలలో మూడు నెలలకు కలిపి ఇస్తారని చెప్పారు. అయితే వరుసగా మూడు నెలలు పింఛన్ తీసుకోకుంటే అలాంటి వాటిని నిలుపుదల చేస్తారని ఆయన స్పష్టం చేశారు.

రోడ్డు ప్రమాదంలో సచివాలయ ఉద్యోగి మృతి


రాజ్‌కుమార్(ఫైల్)

శ్రీకాళహస్తి రూరల్: రోడ్డు ప్రమాదంలో సచివాలయ ఉద్యోగి మృతిచెందిన ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. స్థానికుల సమాచారం మేరకు.. మండలంలోని కాపుగున్నేరి సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌కె కే.రాజ్ కుమార్ (29) గురువారం విధులు ముగించుకుని సాయంత్రం 6.30 సమయంలో ఇంటికి వెళ్లేందుకు కాపుగున్నేరి హైవే రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో శ్రీకాళహస్తి వైపు వేగంగా వెళుతున్న కారు ఢీకొంది. దీంతో రాజ్ కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రికి తీసుకెళుతుండగా.. మార్గమధ్యంలోనే మృతిచెందాడు. పమాదానికి కారణమైన కారుని రూరల్ పోలీస్ స్టేషన్ తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు పేర్కొన్నారు.

క్లుప్తంగా

అమ్మవారి బ్రహ్మోత్సవాలకు పటిష్ట భద్రత: ఎస్పీ



సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్న ఎస్పీ

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలకు పటిష్టమైన బందోబస్తు కల్పిస్తున్నట్టు జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. ఈ నెల 28 నుంచి తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆలయ పరిసరాలు, పుష్కరిణిని గురువారం ఎస్పీ పరిశీలించారు. బందోబస్తుపై అధికారులతో చర్చించారు. పంచమి తీర్థం రోజున పవిత్ర స్నానాలు ఆచరించడానికి ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి సైతం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. వాహనాల పార్కింగ్, భక్తులకు భద్రత, చోరీలకు తావివ్వకుండా చూడటం..తదితర అంశాలపై మార్గదర్శనం చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవి మనోహరాచారి, ఎస్బీ డీఎస్పీ గిరిధర్, చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్, ఎస్బీ సీఐలు శ్రీనివాసులు, విక్రమ్, తిరుచానూరు సీఐ సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

117 మంది విద్యార్థినులకు ఉద్యోగాలు



తిరుపతి సిటీ: పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో గురువారం అసోసియేట్ ఎగ్జిక్యూటివ్ అండ్ టెక్నికల్ సపోర్ట్ స్పెషలిస్ట్ ఉద్యోగాల కోసం జరిగిన క్యాంపస్ డ్రైవ్‌లో 117 మంది విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ డాక్టర్ టి నారాయణమ్మ తెలిపారు. కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థినులకు సత్వా ఇన్ఫోటెక్, సదర్లాండ్ సంస్థలు నియామక ప్రక్రియను చేపట్టారని తెలియజేశారు. ఈ క్యాంపస్ డ్రైవ్‌లో 190 మంది విద్యార్థినులు పాల్గొనగా 117 మంది ఉద్యోగాలకు ఎంపిక కావడం గర్వకారణమన్నారు.

నియామకం

తిరుపతి సిటీ: ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ వైస్ ప్రిన్సిపల్‌గా ప్రొఫెసర్ డీవీ సుబ్బారావును నియమితులయ్యారు. గురువారం ఆయనకు వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు నియామక ఉత్తర్వులు అందజేశారు. అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు ఆయనను అభినందించారు.

తిరుచానూరులో 'స్పెషల్ శానిటేషన్ డ్రైవ్'

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు పంచాయతీలో గురువారం స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. తొలుత తిరుపతి రూరల్ ఎంపీడీఓ రామచంద్రరావు, ఈఓపీఆర్డీ మాధురి, పంచాయతీ సిబ్బందితో కలిసి స్వచ్ఛ తిరుచానూరు బ్యానర్లతో ర్యాలీ నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ, త్వరలో తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఇంటింటికీ వెళ్లి కోరినట్లు చెప్పారు. అలాగే పారిశుద్ధ్యంపై స్థానిక వ్యాపారస్తులకు కూడా అవగాహన కల్పించారు. సచివాలయ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సమాజంలో పురుషుని పాత్ర ఎనలేనిది

పాకాల: సమాజంలో పురుషుని పాత్ర ఎనలేనిదని, కుటుంబం వృద్ధిలోకి రావాలన్నా, పిల్లలు ఉన్నత స్థాయికి ఎదగాలన్నా అందులో ప్రధానమైన పాత్ర పురుషుడికే ఉంటుందని జెడ్పీటీసీ సభ్యురాలు నంగా పద్మజారెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎస్వీఎస్ పాఠశాల ఆవరణలో అంతర్జాతీయ పురుష దినోత్సవం నిర్వహించారు. ఎంఈఓ బాబ్జీని సత్కరించి జెడ్పీటీసీ మాట్లాడారు. అనంతరం పలువురు టీచర్లకు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి సత్కరించారు. టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అభినందన

తిరుపతి రూరల్: దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఎస్పీడీసీఎల్) చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించిన జనార్దన్‌నాయుడును పలువురు అభినందించారు. డీఎస్పీ నుంచి ఏఎస్పీగా ఉద్యోగోన్నతి పొందిన జనార్దన్‌నాయుడిని ఎస్పీడీసీఎల్ సీవీఓగా ఇటీవల ప్రభుత్వం నియమించింది. ఈ నేపథ్యంలో ఆయనతో కలిసి పీలేరులో చదువుకున్న సహచర విద్యార్థులు గోపినాథ్, నరసింహులు, రమేష్, ప్రేమనాథ్, సురేంద్రరెడ్డి గురువారం తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఆయన్ని కలిసి అభినందించారు.

ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లో అగ్నిప్రమాదం

తిరుమల : అగ్నిప్రమాదం చోటుచేసుకున్న ఘటన గురువారం సాయంత్రం స్థానిక నందకం అతిథిగృహానికి సమీపంలో ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో చోటుచేసుకుంది. వంట సిలిండర్ అమర్చే సమయంలో వాల్వ్ లూజై అకస్మాత్తుగా మంటలు వ్యాపించాయి. అదే సమయంలో అక్కడ పనిచేస్తున్న కవిత(45) కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పారు. గాయపడిన మహిళను టీటీడీ అశ్విని ఆస్పత్రికి తరలించారు.

ఎస్వీయూ ప్రకాశం భవనం ఎదుట ఉన్న కల్చరల్ గ్రౌండ్‌లో బార్లను తలపిస్తున్న మద్యం బాటిళ్లు





మందుబాబులకు అడ్డాగా ఎస్వీయూ

విద్యాలయాలను అసాంఘిక శక్తులు అడ్డాగా మార్చుకుంటున్నాయి. విద్యారంగంలో రాయలసీమకే తలమానికమైన ఎస్వీయూ క్యాంపస్ రాత్రి పూట వాతావరణం ఓపెన్ బార్లను తలపిస్తోందనడంలో అతిశయోక్తి లేదు. వర్సిటీలోని కళాశాల భవనాల చుట్టూ బయటి వ్యక్తులు మందు బాటిళ్లతో తిష్టవేసి అర్ధరాత్రి దాటేవరకూ హల్‌చల్ చేస్తున్నారు. ఇప్పటికే వర్సిటీ ఉద్యోగులు, విద్యార్థులు ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలొస్తున్నాయి. వర్సిటీలోని రహదారులలో రాత్రి పూట ప్రశాంతంగా విద్యుత్ దీపాల వద్ద చదువుకుందామనే వచ్చే విద్యార్థులకు మందుబాబుల ఓవరాక్షన్‌కు ఇబ్బందులు పడుతున్నారు.

- రాత్రి పూట బార్లను తలపిస్తున్న క్యాంపస్ పరిసరాలు
- చీకటి పడితే చాలు మందు బాటిళ్లతో సిట్టింగ్‌లు
- నిద్రావస్థలో అధికారులు
- క్యాంపస్‌లో కొరవడిన నిఘా

తిరుపతి సిటీ: ఎస్వీయూ క్యాంపస్‌లో చీకటి పడితే చాలు.. మందుబాబులకు ఆవాసంగా మారిపోతోంది. ఒక్కో ఏరియాలో కనీసం పదిమందికి పైగా బయట వ్యక్తులు గుమిగూడడంతో పాటు పరిచయమైన వర్సిటీ ఉద్యోగులు, విద్యార్థులతో కలసి చీర్స్ అంటున్నారు. సిట్టింగ్‌లు వేస్తున్నారు. కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ ప్రకాశం భవనం ఎదుట ఉన్న కల్చరల్ గ్రౌండ్ స్టేజి వద్ద కనీసం వందల సంఖ్యలో మందు బాటిళ్లు ఉండటం చూస్తే విద్యాలయమేనా!? అని విస్తుపోవాల్సి వస్తోంది. అలాగే క్యాంటీన్ పరిసరాలు, ఏ, బీ బ్లాక్ మెన్స్ హాస్టల్స్ వెనుక ప్రాంతం, కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఎదుట ఉన్న ఓపెన్ స్టేడియంలో, డీడీఈ భవనం, హెచ్ బ్లాక్ సమీపంలో నిర్మాణ దశలో నిలిచిపోయిన భవనంలో, క్షీణదశకు చేరుకున్న ఫ్యాకల్టీ క్లబ్, ఎమ్ఎల్‌టీ భవనాలు మొదలైనవి మందు బాబులకు స్థావరాలుగా మారాయి.

విద్యాలయమా.. అసాంఘిక శక్తుల స్థావరమా..?

రాష్ట్ర ప్రభుత్వం మద్యం దుకాణాలకు విచ్చలవిడిగా అనుమతులు ఇవ్వడంతో నగరంలో మద్యం ఏరులై పారుతోంది. పబ్లిక్ ప్రదేశాలు, విద్యాసంస్థలు బార్లను తలపిస్తున్నాయి. ఎస్వీయూలోని వివిధ ప్రాంతాలు రాత్రి పూట 12గంటల వరకు మందుబాబులతో తూలుతున్నాయి. ఈ దురవస్థ మూలాన ఒక లక్ష్యంతో డీఎస్సీ, గ్రూప్స్, పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యే విద్యార్థులు నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారు. ఒక్కోసారి మద్యం సేవించిన వ్యక్తుల అరుపులు, కేకలు, వికృత చేష్టలకు తాము హడలిపోతున్నట్టు పేరు వెల్లడికి ఇష్టపడని విద్యార్థులు చెప్పారు. ఇక, మందుబాబుల ధాటికి రాత్రి 7 గంటల తర్వాత సంచరించే పరిస్థితి లేని విధంగా ఎస్వీయూ క్యాంపస్ మారిందని మహిళలు, విద్యార్థినులుఆందోళన చెందుతున్నారు. మరోవైపు సరస్వతీ నిలయాలుగా ఉండాల్సి విద్యాలయాలకు మందుబాబుల తీరు మూలాన అప్రతిష్ట మరకలు పడుతున్నా అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని విద్యార్థి లోకం మండిపడుతోంది.



ఎస్వీయూ ఎడ్యుకేషన్ విభాగం వెనుక ప్రాంతంలో..

పెట్రోలింగ్ తూచ్..!

పేరుకు మాత్రమే పోలీసులు పెట్రోలింగ్ అంటూ నెలకోసారి కూడా వర్సిటీలో పర్యవేక్షించడం లేదని విద్యార్థులు చెబుతున్నారు. తూతూమంత్రంగా రెండవ గేటు మూసివేసి చేతులు దులుపుకుంటున్నారని వాపోతున్నారు. ఇకనైనా వర్సిటీలో సెక్యూరిటీని పెంచి, నిత్యం పోలీసుల పెట్రోలింగ్ పెంచాలని, అధికారులు కూడా దీనిపై దృష్టి సారించి ప్రక్షాళన దిశగా చర్యలు తీసుకోవాలని హాస్టల్ విద్యార్థులు కోరుతున్నారు.

ఖేలో ఇండియాకు నిధులు ప్లీజ్!

- కేంద్ర సహాయ మంత్రికి ఎస్వీయూ అధికారుల వినతి
- 4 క్రీడా ప్రాజెక్టుల ఏర్పాటుకు రూ.37.07కోట్లతో ప్రతిపాదన



కేంద్రమంత్రికి వినతి పత్రం ఇస్తున్న వర్సిటీ అధికారులు

తిరుపతి సిటీ: క్రీడా వసతులు, మైదానాలు, ఆట స్థలాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఖేలో ఇండియా పథకానికి సంబంధించిన నిధులను వర్సిటీకి కేటాయించాలని ఎస్వీయూ వర్సిటీ వీసీ సీహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ సహాయ మంత్రి రక్షా నిఖిల్ ఖడ్సేను కోరారు. తిరుపతి పర్యటనలో ఉన్న ఆమెను గురువారం ఓ హోటల్‌లో శాప్ చైర్మన్ రవి నాయుడుతో కలిసి వారు వినతి పత్రం ఇచ్చారు. వర్సిటీలో క్రీడారంగం అభివృద్ధికి సంబంధించిన వివరాలను, ప్రతిపాదనలను ఆమెకు అందజేశారు. ప్రధానంగా రూ.37.07 కోట్లతో సింథటిక్ హాకీ కోర్టు, సింథటిక్ ఫుట్‌బాల్ కోర్టు, మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం, 400 మీటర్ల సింథటిక్ ట్రాక్ ఏర్పాటుకు ప్రతిపాదనలను ఆమెకు సమర్పించారు. దీనిపై ఆమె స్పందిస్తూ..తిరుపతిని స్పెషల్‌గా పరిగణించి క్రీడాభివృద్ధికి సహకరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆచార్య శివశంకర్ రెడ్డి, వర్సిటీ అధికారులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న కేంద్ర సహాయ మంత్రి

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ సహాయ మంత్రి రక్షా నిఖిల్ ఖడ్సే గురువారం సాయంత్రం దర్శించుకున్నారు. ఆలయం వద్ద ఆమెకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అమ్మవారి మూలమూర్తి దర్శనానంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆమెకు ఆశీర్వచనం పలికారు. అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆమెకు బీజేపీ జిల్లా సాంస్కృతిక విభాగం కన్వీనర్ గుండాల గోపినాథ్‌రెడ్డి స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని బహూకరించారు. ఆలయ సూపరింటెండెంట్ శ్రీవాణి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాత్రి బస కేంద్రాన్ని పరిశీలించిన కమిషనర్



రాత్రి బస కేంద్రంలో ఆశ్రయం పొందిన వారితో మాట్లాడుతున్న కమిషనర్

తిరుపతి తుడా: స్థానిక పట్నూలు వీధిలోని రాత్రి బస కేంద్రాన్ని (నైట్ షెల్టర్) నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య బుధవారం రాత్రి పరిశీలించారు. కేంద్రంలో కల్పిస్తున్న మౌలిక వసతులను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అక్కడే ఉన్న పలువురితో మాట్లాడారు. వారి వివరాలు తెలుసుకుని కేంద్రంలో అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. బస చేస్తున్న వారికి అందించే భోజనాన్ని కమిషనర్ రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. కమిషనర్ మాట్లాడుతూ, కేంద్రంలో నాణ్యమైన భోజన వసతి, వైద్య సదుపాయాలు అందించాలన్నారు. మరుగుదొడ్లు, మంచాలు, బెడ్లు శుభ్రంగా ఉండేలా చూడాలని నిర్వాహకులను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, మెప్మా సీఎంఎం కృష్ణవేణి, హూప్ సంస్థ ప్రతినిధి కవిత పాల్గొన్నారు.

పార్కులను శుభ్రంగా ఉంచాలి

తిరుపతి తుడా: తిరుపతిలో ప్రజలకు ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని పంచుతున్న పార్కుల్లో పారిశుద్ధ్య పనులను మెరుగ్గా చేసి శుభ్రంగా ఉంచాలని నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. నగరంలోని వినాయక సాగర్‌లో పారిశుద్ధ్య పనులను, తాగునీటి సాంద్రత పరీక్షలను గురువారం ఇంజినీరింగ్, హెల్త్ అధికారులతో కలసి కమిషనర్ తనిఖీ చేశారు. వినాయక సాగర్‌లో నీటిపై పేరుకుపోయిన చెత్తను, అలాగే వాకింగ్ ట్రాక్ పరిసర ప్రాంతాల్లో రోజూ చెత్త తొలగించాలని, సచివాలయ కార్యదర్శులతో నిత్యం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. వాకర్స్ నివేదించిన సమస్యలను పరిష్కరించాలిని, స్విమ్మింగ్ పూల్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. అనంతరం ఆటోనగర్ తదితర ప్రాంతాల్లో నీటి సాంద్రత పరీక్షలను తనిఖీ చేశారు. తనిఖీల్లో సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, హెల్తాఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డీఈ రమణ, శానిటరీ సూపర్‌వైజర్ సుమతి, ఏఈకామ్ ప్రతినిధులు బాలాజి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

స్థానికులకు శ్రీవారి దర్శన నిర్ణయం హర్షణీయం

తిరుపతి కల్చరల్: టీటీడీ ధర్మకర్తల మండలి స్థానికులకు ప్రతి నెలలో మొదటి మంగళవారం తిరుమల శ్రీవారి దర్శనం కల్పించాలని నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని గాండ్ల సాధికార సమితి నేత జగన్నాథం హర్షం వ్యక్తం చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీటీడీ బోర్డుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో బీసీ సంఘాల నేతలు రామారావు, ధ్యానశేఖర్, జ్యోతి కుమార్, చంద్రమోహన్, సురేష్ పాల్గొన్నారు.

చంద్రగిరి వాసులకూ శ్రీవారి దర్శనం కల్పించరూ!

చంద్రగిరి: తిరుమల శ్రీవారి దర్శనం ప్రతి నెల మొదటి మంగళవారం తిరుపతి వాసులకు కల్పిస్తున్నట్లే, చంద్రగిరి వాసులకు కూడా కల్పించాలని జెడ్పీటీసీ చిల్లకూరి యుగంధర్ రెడ్డి కోరుతూ టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. గురువారం స్థానిక శ్రీకోదండరామాలయాన్ని టీటీడీ బోర్డు సభ్యుడు దర్శించుకున్నారు. స్థానిక నాయకులు ఆలయ అభివృద్ధితో పాటు కాలినడక వచ్చే భక్తుల కోసం శ్రీవారి సదన్, ఆలయ పుష్కరిణికి మరమ్మతులు, అలంకార నూతన మండప నిర్మాణం, ఆలయ గోపుర నిర్మాణ పనులు చేయాలని ఆయన్ను కోరారు. స్థానికుల వినతులను రానున్న బోర్డు సమావేశం దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారు. అలాగే ఇతరత్రా సమస్యలను ఆయన దృష్టికి నివేదించారు.



ఆలయ అభివృద్ధిపై స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో మాట్లాడుతున్న టీటీడీ బోర్డు సభ్యుడు

నేడు విద్యుత్ అంతరాయం

చంద్రగిరి: సబ్‌స్టేషన్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు పనుల దృష్ట్యా మండలంలోని ఏ.రంగంపేట సబ్‌స్టేషన్ పరిధిలోని ఏ.రంగంపేట, పుల్లయ్యగారిపల్లె, కొటాల, కూటంవారిపల్లె ప్రాంతాలలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఏపీ ఎస్పీడీసీఎల్ డీఈ శేషాద్రి రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఆలయ పనులు పూర్తి చేయండి

తిరుపతి కల్చరల్: త్వరితగతిన శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయ పునర్నిర్మాణం పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను టీటీడీ ఇంజినీర్లు ఆదేశించారు. గురువారం టీటీడీ డెప్యూటీ ఇంజినీర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గంగమ్మ ఆలయ పునర్నిర్మాణం పనులను పరిశీలించారు. ఇక్కడ పెండింగ్‌లో ఉన్న పనులను జాప్యం చేయకుండా పూర్తి చేయించాలన్నారు. ఇదలా ఉంచితే, చెన్నైకు చెందిన వాసంతి షణ్ముగం ఆలయ నిర్మాణానికి గురువారం రూ.1,02,346 విరాళంగా అందజేశారు. ఆలయ ఈఓ ఏ.జయకుమార్ పాల్గొన్నారు.

'బహిర్భూమి వద్దు..మరుగుదొడ్లే ముద్దు'



మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన ర్యాలీ చేస్తున్న ప్రజా ప్రతినిధులు

పాకాల: పాకాల గ్రామ పంచాయతీలో ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గురువారం స్థానిక సర్పంచ్ ఎస్.కస్తూరి ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మరుగుదొడ్లను వాడకం వల్ల ప్రజలు ఆరోగ్యంగా ఉండవచ్చని ర్యాలీలో చాటిచెప్పారు. అధికారులు మాట్లాడుతూ, కొందరు ప్రకృతి పిలుపులకు బహిర్భూమికి వెళ్లడం స్వస్తి పలికి, మరుగుదొడ్ల వాడకం అలవాటు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మలమూత్ర విసర్జన చేస్తే పలు అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసుల రెడ్డి, ఏఈ నవీన్, ఇన్‌చార్జ్ ఈఓ అబిద్, మోహన్ నాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన జాతీయ నవజాత శిశు వారోత్సవాలు



బహుమతులను అందజేస్తున్న రుయా అధికారులు

తిరుపతి తుడా: ఎస్వీ వైద్య కళాశాల, రుయా ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ నవజాత శిశు వారోత్సవాలు గురువారం ముగిశాయి. వైద్య విద్యార్థులు, నర్సింగ్, పారా మెడికల్, ఫార్మా-డీ విద్యార్థులకు పోస్టర్, క్విజ్, ఉత్తమ నినాదం పోటీలు నిర్వహించి విజేతలకు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్, రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభు చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, డాక్టర్ సత్యనారాయణ, వైద్యులు కిరీటి, వెంకట్, అంజన్, పద్మిని, మానస, పద్మజారాణి, స్నిగ్ధ, స్పందన, మనోహర్, వైద్య విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టరేట్ ధర్నా విజయవంతం చేయండి

పాకాల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతాంగ, కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ తిరుపతి కలెక్టరేట్ వద్ద నిర్వహించ తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.హేమలత పిలుపునిచ్చారు. గురువారం పాకాలలో ఆటో కార్మికులు, పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు, ఆశా వర్కర్లతో వేర్వేరుగా సమావేశమై ఆమె మాట్లాడారు. పంటలకు సరైన మద్దతు ధర లేక రైతులు నష్టపోతున్నారని, సరైన మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. దశాబ్దాల పాటు సంఘటిత శక్తితో కార్మికులు సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి కార్మిక వ్యతిరేక కార్పొరేట్ అనుకూల నాలుగు లేబర్ కోడ్‌లను, అలాగే రైతాంగం మోటర్లకు మీటర్లు బిగించే నిర్ణయాన్ని రద్దు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు మధుసూదన్‌రావు, మండల కన్వీనర్ ప్రసాద్, కేవీపీఎస్ నాయకులు నరేంద్ర, ఆటో యూనియన్ నాయకులు ఆనంద్, రాజు, దేవేంద్ర, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.



ధర్నా కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

డీఎల్‌డీఓ ఆకస్మిక తనిఖీ

తిరుపతి రూరల్: తిరుపతి డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్(డీఎల్‌డీఓ)గా బాధ్యతలు స్వీకరించిన జీవీ నారాయణరెడ్డి గురువారం రూరల్ మండల పరిషత్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్షించారు. అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. తొలిసారి కార్యాలయానికి విచ్చేసిన డీఎల్‌డీఓను ఎంపీడీఓ రామచంద్ర, సిబ్బంది సత్కరించారు.

దేశాన్ని కలిపే భాష హిందీ



మాట్లాడుతున్న సంస్కృత వర్సిటీ వీసీ కృష్ణమూర్తి

తిరుపతి సిటీ: హిందీ భాష రాజ్య భాషగా వెలుగొందుతుందని, ప్రతి పౌరుడు అవగాహన పెంచుకోవాలని జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి అన్నారు. గురువారం నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ ఆధ్వర్యంలో వర్సిటీ వేదికగా రాష్ట్ర స్థాయి హిందీ కార్యశాల కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ, హిందీ భాష దేశాన్ని కలిపే భాష అని, భారతీయ పౌరులు హిందీని నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ రాష్ట్ర సంచాలకులు అంశుమాన్ ప్రసాద్ దాస్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ హిందీ నేర్చుకోవాల్సిన ఆవశ్యకతను గుర్తించాలన్నారు. జిల్లా యువజన అధికారి ప్రదీప్‌కుమార్, రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా యువజన అధికారులు, గణాంక అధికారులు, యువ కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు సమాజానికి జీవనాడులు



ప్రసంగిస్తున్న విశ్రాంత వీసీ యల్లంపల్లి వైకుంఠం

తిరుపతి సిటీ: గ్రంథాలయాలు సమాజాభివృద్ధికి జీవనాడులని కాకతీయ వర్సిటీ విశ్రాంత వీసీ యల్లంపల్లి వైకుంఠం అన్నారు. గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా గురువారం ఎస్వీయూ ప్రధాన గ్రంథాలయంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడారు. విజ్ఞాన భాండాగారాలైన గ్రంథాలయాలను, వీటిలోని నూతన టెక్నాలజీని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. డైరెక్టర్ ప్రొఫెసర్ సురేంద్ర బాబు మాట్లాడుతూ, వర్సిటీ లైబ్రరీలో విద్యార్థులకు అవసరమైన అన్ని గ్రంథాలున్నాయని, డిజిటల్ లైబ్రరీని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఒంగోలు ట్రిపుల్ ఐటీ మాజీ డైరెక్టర్ కృష్ణమూర్తి, ప్రొఫెసర్ వెంకటరావు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడుతున్న అటవీ అధికారులు

– తిరుమల పాపవినాశం షికారీల ఆరోపణ



మాట్లాడుతున్న పాపవినాశనం వ్యాపారి రాధాకృష్ణ

తిరుపతి కల్చరల్: తిరుమల పాపవినాశనంలో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది అక్రమాలు పెచ్చరిల్లుతున్నాయని, శ్రీవారి భక్తులనే నమ్ముకొని బతుకుతున్న షికారులు, స్థానికులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని పాపవినాశనం వ్యాపారి రాధాకృష్ణ ఆరోపించారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 45 ఏళ్లుగా పాపవినాశంలో వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషిస్తున్నామని, గతంలో పాపవినాశంలో 27 షాపులే ఉండేవని, మాస్టర్ ప్లాన్‌లో భాగంగా మరి కొన్ని షాపులు తిరుమల నుంచి తమ ప్రాంతానికి తరలించి, కొంతకాలం తర్వాత టీటీడీ పరిధిలోని షాపులను అటవీశాఖ పరిధిలోకి మార్పు చేశారన్నారు. అప్పటి నుంచి ప్రతి ఏటా అటవీ శాఖకు బాడుగలు చెల్లిస్తున్నట్టు తెలిపారు. అయితే ఇటీవల అనుమతి లేకుండా కొత్త దుకాణాలను, టీ షాపును ఏర్పాటు చేశారని, దీనిపై ప్రశ్నిస్తే తమపై దౌర్జన్యం చేయడమే కాకుండా తన షాపును కూడా ధ్వంసం చేశారని వాపోయారు. తిరుమల నుంచి పాపవినాశంకు వచ్చే యాత్రికుల వాహనాలకు టోల్‌గేట్ రూపంలో రుసుం వసూలు చేస్తూ ఎలాంటి స్లిప్పులు ఇవ్వకుండా ఆ డబ్బును తమ జేబుల్లో వేసుకుంటున్నారని ఆరోపించారు. పాపవినాశనంలో అనధికారికంగా ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించాలని, అక్రమాలకు పాల్పడుతున్న అటవీ సిబ్బందిపై ప్రభుత్వం చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో షికారీలు బాలు, ధర్మ, చిన్న తంబి, బాలాజి, రాజా, మధుర మన్యం పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 9 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 59,231 మంది స్వామివారిని దర్శించుకోగా 22,029 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.08 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలో, దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 6 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చాలి



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న మత్స్యకార సంఘ నేతలు

తిరుపతి కల్చరల్: మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చాలని జాతీయ మత్స్యకారుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పీ.భక్తవత్సలం డిమాండ్ చేశారు. ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం పురస్కరించుకుని గురువారం మత్స్యకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆదిమూలం, గిరిబాబు ఆధ్వర్యంలో అన్నమయ్య సర్కిల్ నుంచి అర్బన్ తహసీల్దార్ కార్యాలయం వరకు, అక్కడి నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి జిల్లా కలెక్టర్‌కువినతి పత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ , పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడులో మత్స్యకారులను వెనుకబడిన కులాల జాబితాలో చేరుస్తూ ఆయా ప్రభుత్వాలు ఉత్తర్వులు జారీ చేశాయని ఆయనకు నివేదించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామన్నారు. జాతీయ మత్స్యకారుల సంఘం ఉపాధ్యక్షుడు పీ.రమేష్, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు టీ.లక్ష్మీదేవి, బెస్త సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునిబాలసుబ్రమణ్యం, జిల్లా అధ్యక్షుడు కల్యాణ్ చక్రవర్తి, జీ.రాజేష్ గాంధీ, పీ.రమణ, రమణయ్య, దాము పాల్గొన్నారు.